బయోమెట్రిక్ సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచాలి

రాష్ట్ర పోస్టల్ శాఖ డైరెక్టర్ శరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

యాచారం, జూలై 30: గ్రామీణ ప్రాంతాలలో ఆసరా పింఛన్ అందజేసే బయోమెట్రిక్ మిషన్లను 2జీ నుంచి 5జీకి మార్చి, సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతూ వీహెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జగ్గయ్య రాష్ట్ర పోస్టల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శరత్‌కుమార్‌కు మంగళవారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈనెల 29న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'నో సిగ్నల్' అనే శీర్షికన ప్రచురితమైన పేపర్ క్లిప్ ను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగ్నల్ సమస్యతో సకాలంలో పింఛన్ అందుకోవడంలో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై సెర్ప్ డైరెక్టర్ ప్రధాన దృష్టి సారించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. 2జీ నుంచి 5జీకి మార్చాలని, దీనికోసం పోస్టల్ శాఖ బడ్జెట్ కేటాయించాలని కోరారు. అనంతరం పోస్టల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ.. యాచారం మండలంలో తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

వెటర్నరీ వైద్యురాలికి ఘనంగా సన్మానం

ఆదిభట్ల, జూలై 30 : ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ గ్రామ పశు వైద్యాధికారి బదిలీపై మర్రిగూడెం వెళుతున్న పి.సురేందర్‌ను గ్రామస్తులు, యువకులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. అలాగే బదిలీపై గ్రామానికి వచ్చిన పశు వైద్యురాలు సరితను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక అధికారి విజయ్‌కుమార్ రెడ్డితో రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యాన్ని అందించాలి

డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం హెచ్‌వో విజయలక్ష్మి

షాద్‌నగర్ రూరల్, జూలై 30: సీజనల్ వ్యాధులు పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వైద్యులకు, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో మంగళవారం డివిజన్లలోని అన్ని ప్రాథమిక కేంద్రాల వైద్యులు, డీఈవోలకు ఏఎన్ఎంలకు సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆమె హాజరై తగు సూచనలు సలహాలు చేశారు. గర్భిణులు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని నమోదు చేసుకొని వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. వెంటనే వారికి టి.టి వ్యాక్సినేషన్ ఇచ్చి, నెలకు సరిపడా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా గర్భిణులు ఎనిమియా వ్యాధికి గురికాకుండా చూడాలన్నారు. ప్రతి శనివారం పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలను ఇవ్వాలని సూచించారు. బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన మాత్రలు ఇవ్వాలన్నారు.. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్,డివిజన్ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీయే లక్ష్యం

షాద్ నగర్ టౌన్, జూలై 30: షాద్‌నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని 11వ వార్డులో మంగళవారం సీసీ రోడ్ పనులను కౌన్సిలర్ శారదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాలువలు ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక కౌన్సిలర్, తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు శ్రీశైలం గౌడ్, పర్వతపురం భిక్షపతి, ఎన్. మహేశ్, ప్రశాంత్, రామచందర్, అలీ, సాదిక్, వీరేశం అప్ప, కృష్ణ, అంజి, నర్సింహ, శివ, అభి, నిర్మల, నవనీత, జహేదాబేగం, లలిత తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, జూలై 30: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా, మంగళవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో రైతులు గందరగోళానికి గురవుతున్నారని, లక్షలోపు రుణమాఫీ కాని వారి సంఖ్య వేలల్లో ఉందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విధంగానే ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. రుణమాఫీకి అర్హత కలిగిన రైతు కుటుంబాల్లో ఎవరికైనా గ్రూప్-4 ఉద్యోగం ఉంటే వారికి రుణమాఫీ కాలేదని కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. డీసీసీబీ జిల్లా బ్యాంక్‌లో కంప్యూటర్ ఆపరేటర్ల కొరతతో పాటు, ఇంటరాక్ట్ కంప్యూటర్ సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో కొంతమంది రైతుల వివరాలను అధికారులు ఆన్‌లైన్లో పొందుపరచకపోయారని పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన వివరాలను డీసీసీబీ కార్యాలయాలకు పంపించామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీవో ధాత్రి దేవి, డీఏవో గీతారెడ్డి, మహబూబ్‌నగర్ డీసీసీబీ డైరెక్టర్లు మంజుల, బక్కన్నయాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదిభట్ల, జూలై 30 : కత్తి చూపించి బెదిరించిన ఓ వ్యక్తిపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆదిభట్ల ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం కురుమలగూడ రాజీవ్ గృహకల్పకు చెందిన నేనావత్ చరణ్ సోమవారం తాను ఉండే కాలనీలో తన స్నేహితులు కోటేష్, నాగరాజు, చింటూతో కలిసి క్రికెట్ ఆడుతుండగా అదే కాలనీకు చెందిన మరో స్నేహితుడు సోపియన్ క్రికెట్ ఆడుతున్న చరణ్‌తో గొడవపడ్డాడు. చరణ్, సోపియన్ ను కొట్టడంతో సోపియన్ తన సోదరుడు సోయల్‌కు చెప్పి ఇద్దరు కలిసి చరణ్ ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. దీంతో పక్కనే ఉన్న మరో వ్యక్తి కరీం ఎందుకు గొడవ పడుతున్నారని అడ్డు చెప్పడంతో సోపియన్ తండ్రి కత్తితో వచ్చి కరీంను చంపేస్తానని బెదిరించాడు. కత్తి చూపించి బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని నేనావత్ చరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

అరెస్టులు సమంజసం కాదు

కొత్తూరు, జూలై 30: కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో కూడా అరెస్టులు సమంజసం కాదని సీటీయూటీ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సీఐటీయూ నాయకులను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రజా ప్రాలనలో అరెస్టుల చేస్తారా అని ప్రశ్నించారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలి ఆయన డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బి. జాంగీర్, మంజుల, ఇందిర, నవనీత, ఆశ వర్కర్లు ఉన్నారు.

ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత, అడిషనల్ పీడీ సుభాషిణి, ఎంపీడీవో సుజాత

ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

కడ్తాల్, జూలై 30: మండలంలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీపై ప్రజావేదికను, మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీలత, అడిషనల్ పీడీ సుభాషిణి పాల్గొన్నారు. మండలంలో మూడో విడుత సామాజిక తనిఖీలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ 2023 నుంచి 2024 మార్చి 31 వరకు ఈజీఎస్‌లో చేపట్టిన పనులపై తనిఖీ చేశారు. 24 గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్‌లో పనులపై క్షేత్రస్థాయిలో, సామాజిక బృందం సభ్యులు ఈ నెల 18 నుండి 29 వరకు గ్రామాల్లో తనిఖీ చేసిన వివరాలను ప్రజావేదికల్లో వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా డీఆర్పీలు వెల్లడించిన వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ శ్రీలత మాట్లాడుతూ ఈజీఎస్ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ కూలీలతో పనులు చేయించాలని తెలిపారు. ఆధార్ కార్డులను పరిశీలించి వారు స్థానికంగానే ఉంటున్నారా, లేదా తదితర విషయాలను పరిశీలించిన తర్వాతే జాబ్ కార్డులు అందజేయాలని సూచించారు. వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సిక్రియానాయక్, ఎస్ఆర్‌పీ వెంకన్న, ఏపీవో లలిత, పీఆర్ ఏఈ పరమేశ్, టీఏ అంజయ్య, సద్గుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

షాద్‌నగర్ రూరల్, 30 జూలై : రెండో విడుత రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంపై ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని మాజీ జడ్పిటీసీ వెంకటరామిరెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామంలో వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో రెండో విడుత రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వస్తుందని, రానివారు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ పై చర్యలు తీసుకోవాలి

తుర్కయంజాల్, జూలై 30: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ లేఅవుట్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (CPI) ఆధ్వర్యంలోమంగళవారం మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ రెవెన్యూ పరిధిలో 3 ఎకరాల భూమిలో అక్రమ లేఅవుట్ ఏర్పాటు చేశారని, దీనిపై గతంలో సీపీఐ పార్టీ చర్యలు తీసుకోవాలని కోరగా రెవెన్యూ అధికారులు లే అవుట్ ను పాక్షికంగా ధ్వంసం చేశారని అన్నారు. వ్యాపారస్తులు లేఔట్ లో ఇంకా అమ్మకం, కొనుగోలు చేస్తూనే సామాన్య ప్రజానీకాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ లే అవుట్ల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ అమరేందర్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి శివకుమార్, శివ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు శిరీషపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కొత్తూరు, జూలై 30: క్రమశిక్షణ లోపించిన విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టిన ఉపాధ్యాయురాలు శిరీపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ సభ్యత్వ నమోదు భాగంగా కొత్తూరు, నందిగామ మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌లో కన్నయ్య గారి గోవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ జీవో నంబర్ 11,12ను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్ఎం పోస్టు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, అధ్యక్షుడు రాఘవేందర్, కార్యదర్శులు అనిత, ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యక్షులు గోపి, బాల ప్రసాద్, రవికుమార్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ భవన నిర్మాణ పనుల పరిశీలన

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ముంతాజ్, నాయకులు

కడ్తాల్, జూలై 30: మండల కేంద్రంలో చేపట్టిన తహసీల్దార్ భవనం నిర్మాణ పనులను, మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ ముంతాజ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవనం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆమె పేర్కొన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని నేతలు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా, నాయకులు జహంగీర్‌అలీ, రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ

షాబాద్, జూలై 30: షాబాద్ మండలంలో బోనాల ఊరేగింపు అంగరంగా వైభవంగా నిర్వహించారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ, షాబాద్ తదితర గ్రామాల్లో మైసమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పోనమోని కేతనరమేశ్‌యాదవ్, తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ ఎంపీటీసీలు దేశమళ్ల అరుణ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ జడల లక్ష్మిరాజేందర్‌గౌడ్, నాయకులు రమేశ్‌యాదవ్, ఆంజనేయులు, శ్రీశైలంయాదవ్, రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

షాబాద్, జూలై 30: బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, మాజీ వార్డు సభ్యుడు బేగరి గణేష్ మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం తన వంతు సహాయంగా మృతుడి కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీరాంరెడ్డి తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

పెద్దఅంబర్‌పేట, జూలై 30: వార్డు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నట్టు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ బొర్ర అనురాధ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి ఐదోవార్డు పెద్దఅంబర్‌పేటలోని కొహెడ రోడ్డు నుంచి గంజి గురునాథం ఇంటివరకు రూ.6 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గుడిగంటల దొంగ

నిందితుడి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న గుడి గంటలు

యాచారం, జూలై30: మండలంలో పలు ఆలయాల్లో గుడిగంటలు దొంగిలించిన దొంగను వాహనాల తనిఖీల్లో సోమవారం రాత్రి పట్టుకొని అతడి వద్ద ఉన్న గుడి గంటలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శంకర్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలో కొద్ది రోజులుగా ఆలయాల్లో గుడిగంటలు దోపిడీకి గురైతున్న విషయం తెలిసిందే. వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారించగా నిందితుడు నేరం అంగీకరించారు. అతడి వద్ద గుడిగంటలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చౌటుప్పల్‌కు చెందిన బండారి దుర్గాప్రసాద్(28)గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి

మొయినాబాద్, జులై 30: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని తెలంగాణ ఉద్యమకారులు గడ్డం వెంకట్రెడ్డి, కేబుల్ రాజు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పి ఇప్పటివరకు కల్పించలేదన్నారు. హామీలపై ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళుతుండగా, మంగళవారం ఉద్యమకారులను మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు వెంకట్‌రెడ్డి, కేబుల్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులను ఇస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని అన్నారు. అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల ప్రస్తావన రాకపోవడం బాధాకరమని అన్నారు. వినతి పత్రం ఇచ్చేందుకు గాంధీభవన్‌కు వెళుతుండగా పోలీసులు అరెస్టులు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టైన వారిలో మహిపాల్, నవీన్‌కుమార్, రజినీకాంత్, బన్సీలాల్, నర్సింహులు, భిక్షపతి, శివ, ముకుంద రెడ్డి, సిద్ధు, చంద్రయ్య, రాజు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం

నందిగామ, జూలై30: ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం నందిగామ మండలం ఈదులపల్లి గ్రామ శివారులోని కేకే గెస్ట్ హౌస్ లో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో పోరాటం మరింత ఉధృతం చేయాలని అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్, రాజు, చంద్రమోహన్, జగదీశ్, యాదయ్య, సామెల్, శోభన్, కవిత, చంద్రమోహన్, నర్సిరెడ్డి, కొంగరా నరసింహ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో లేగ దూడ మృత్యువాత

యాచారం, జూలై 30 : వీధి కుక్కుల దాడిలో ఓ లేగదూడ మృత్యువాత పడిన ఘటన మండలంలోని మేడిపల్లీ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బండరాజుకు చెందిన పశువుల పాకపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో లేగ దూడ మృత్యువాత పడిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వీధి కుక్కల దాడి నుంచి మూగ జీవాలను కాపాడాలని అధికారులను బాధిత రైతు వేడుకున్నాడు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

చేవెళ్ల టౌన్, జూలై 30: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే. రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి అన్నారు. మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఇందిరా పార్కు వద్ద చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి వెళుతుండగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, పార్టీ జిల్లా, మండల కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండీ మక్బూల్ గీత పనివాళ్ల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ తదితరులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పుకొని అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తుందన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేసుకోవచ్చని అనుమతిచ్చిన ప్రభుత్వం మరోపక్క పోలీసులతో అక్రమ అరెస్టులను చేయడం హేయమైన చర్య అని ఆరోపించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి శివయ్య బాబురావు యాదగిరి ఆనందం లలిత రమాదేవి పెంటయ్య ఉన్నారు.

అసంపూర్తిగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

మంచాల జూలై 30: గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేదలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంతో కృషి చేశారు. మంచాల మండలం రంగాపూర్, లోయపల్లి, బోడకొండ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తే అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు నిలిచిపోయాయి. దీంతో లోయపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇకనైనా అధికారులు మేలుకొని నిలిచిపోయిన పనులను వేగవంతం చేసి పేదలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లోయపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

మొయినాబాద్, జూలై 30: మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక బదిలీ కావడంతో మంగళవారం గ్రామపంచాయతీ యువ నాయకుడు నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హైమద్, నూతన కార్యదర్శి యాదగిరి, నాయకులు గౌతి రవి, జహంగీర్, నీలకంఠం, గౌరీ కృష్ణ పాల్గొన్నారు.



కార్యదర్శి ప్రియాంకను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు